క్లుప్తంగా

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

మణుగూరుటౌన్: నియోజకవర్గంలో శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు గెలిచిన 10 నెలల కాలంలోనే అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్ అన్నారు. ప్రజా సమస్యలపై తపన పడుతున్న ఎమ్మెల్యేకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక వాళ్ల ఉనికి కోసం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వాళ్ల బృందం ఎమ్మెల్యే పాయంపై తప్పుడు ఆరోపణలు చేసుకుంటూ పబ్బం గడుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వాళ్ల మాట వినని అధికారిపై ఒత్తిడి తెచ్చి ఒక అధికారిని బదిలీ చేసుకుంటూ భయభ్రాంతులకు గురి చేసి చెప్పుచేతల్లో పెట్టుకుని అరాచకాలు సృష్టించిన వారు మీరు కాదా అని ప్రశ్నించారు. ఇవన్నీ గమనించే ప్రజలు ఎంతో వేదన అనుభవించి మీకు తగిన బుద్ధి చెప్పారని బీఆర్ఎస్ నుద్దేశించి అన్నారు. ప్రజాసేవకుడు అయిన పాయంను అత్యధిక మెజార్టీతో గెలిపించారని అన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకుని చేసిన తప్పులను ఎలా సరిదిద్దుకోవాలని ఆలోచించండి మీరు పెట్టిన అక్రమ కేసులు కబ్జాల వల్ల బలైపోయిన కుటుంబాల ఆధారాలతో సహా నిరూపిస్తామని, దమ్ముంటే చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. మీ ఉనికి కోసం నిందలు వేయడం మానుకోవాలన్నారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

భగీరథ కార్మికుల సమ్మె విరమణ

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెంలోని రథంగుట్ట వద్ద వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో పని చేస్తున్న మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు పెండింగ్‌లో ఉన్న తమ నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని శనివారం నుంచి సమ్మె చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లాంటు వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. కార్మికుల సమ్మెతో పినపాక నియోజకవర్గంలో ఆదివారం తాగునీటి సరఫరా ఆగిపోయింది. మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివం, ఈఈ నలిని, డీఈ మహేందర్‌రెడ్డి చొరవ తీసుకొని కార్మికులు, యూనియన్ నాయకులతో చర్చించారు. మూడు నెలల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు తాత్కాలికంగా సమ్మె విరమించారు.

మృతులకు ఎమ్మెల్యే నివాళి

దమ్మపేట: మండలంలో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం మృతుల భౌతిక కాయాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో బొంతు అప్పారావు, నాయుడుపేట గ్రామంలో పర్వతనేని వెంకమ్మ అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందగా.. వారి భౌతిక కాయాలను సందర్శించిన ఎమ్మెల్యే జారే పూలమాలతో నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. చిన్నగొల్లగూడెం గ్రామంలో ఇటీవలే మరణించిన మచ్చల మహాలక్ష్మడు చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేల పరామర్శ

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం పర్యటించారు. అన్నారం గ్రామానికి చెందిన జీపీ కార్మికుడు పొడియం నారాయణ దశదిన ఖర్మలో పాల్గొని, నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి. నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మొగరాల గుప్ప గ్రామంలో ఇటీవల మృతి చెందిన గడ్డం వీరమ్మ కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు గడ్డం భవాని, నతానియేల్, తాటి రవి, గంగవరపు సుధాకర్ తదితరులు ఉన్నారు.

మరోవైపు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పొడియం నారాయణ దశదిన ఖర్మలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. మర్కోడు మాజీ ఎంపీపీ కోండ్రు మంజుభార్గవి, మిడియం బుల్లబ్బాయి, కోండ్రు భాస్కర్ తదితరులు ఉన్నారు.

108 రోజుల దీక్షకు మద్దతు

గుండాల: ఓల్డ్ పెన్షన్ స్కీం సాధన, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కోసం ఆళ్లపల్లి మండలం జాకారం ఎంపీపీఎస్ హెచ్ఎం షేక్ మహమూద్ పాషా చేస్తున్న 108 రోజుల ఫలహార దీక్షకు సేవ్ కొత్తగూడెం, సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ ఆదివారం సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో చాలా బలమైన ఉద్యమాన్ని నడిపిస్తున్న వ్యక్తిగా పాషాను కొనియాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో 108 రోజులపాటు ఫలహార దీక్ష చేయడాన్ని అభినందించారు. పాషాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

పంచాయతీ సేవలపై నీలినీడలు

- కానరాని పౌర సేవల పట్టికలు
- నిర్ణీత సమయానికి మించి పెండింగ్‌లో సమస్యలు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



తాటిగూడెం గ్రామ పంచాయతీ..

కరకగూడెం: గ్రామ పంచాయతీ వ్యవస్థ అనేది గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలన, అభివృద్ధి, ప్రగతిని చాటించే మాధ్యమంగా పని చేస్తుంది. గ్రామ పంచాయతీలు స్థానిక సమస్యలను పరిష్కరించడం అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం, ప్రజల అవసరాలను తీర్చడం కోసం ఏర్పాటు చేయబడ్డాయి. అయితే పంచాయతీల పనితీరు వాటి సమర్థతపై అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ క్రమంలో మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ప్రజలకు పౌర సేవలు అరకొరగానే అందుతున్నాయి. పంచాయతీలో ఏఏ సేవలు అందుబాటులో ఉంటాయో వాటిని ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారో సూచిస్తూ పంచాయతీ కార్యాలయాల్లో విధిగా పౌరసేవల పట్టికలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కొన్ని పంచాయతీ కార్యాలయాల్లో నామ మాత్రంగా ఏర్పాటు చేయగా.. మరికొన్ని పంచాయతీల్లో పౌర సేవల బోర్డుల జాడ లేకుండా పోయింది. దీంతో పౌరసేవల గురించి ప్రజలకు తెలియకపోవడమే కాకుండా ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతోంది.

మండలంలో 16 పంచాయతీలు ఉండగా ప్రభుత్వ విధానాల ప్రకారం, గ్రామ పంచాయతీలలో ప్రజలకు పౌర సేవలు అందించడానికి ఏర్పడిన వ్యవస్థ చాలా కీలకమైనది. అయితే ప్రస్తుత పరిస్థితులు సంతృప్తికరంగా లేవు.ఇది ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా పౌర సేవల పట్టికలను సరైన విధంగా ఏర్పాటు చేయకపోవడం సమాచార లోపం, అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు తమ హక్కులను సాధించలేకపోతున్నారు. పంచాయతీ కార్యాలయాల్లో పౌరసేవలు అమలు కాకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు.

పంచాయతీ పరిధిలో సేవలివి..

గ్రామ పంచాయతీలలో ప్రజలకు అందించాల్సిన 48 రకాల పౌర సేవలు గ్రామ అభివృద్ధిలో కీలకమైనవి. ఈ సేవలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న సేవల ప్రమాణం మెరుగుపడుతుంది. తద్వారా ప్రభుత్వ లక్ష్యాలను సాధించవచ్చు. సమస్యల పరిష్కారంపై అవగాహన లేకపోవడం వలన పౌరుల పట్ల నిరాశ కలుగుతుంది. అందువల్ల పంచాయతీ కార్యాలయాల్లో సేవలను సమర్థవంతంగా నిర్వహించడం, పనులపై పర్యవేక్షణ ఉంచడం అధికారుల బాధ్యత. పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు, వీధి దీపాలు, తాగునీరు, నిర్మాణాలకు అనుమతులు, జనన, మరణ ధ్రువపత్రాల జారీ, సామాజిక ఆస్తులు, వైకుంఠదామాల నిర్మాణం, అదనపు వసతుల ఏర్పాటు, ప్రజా ఆస్తుల ఆక్రమణలను అడ్డుకోవడం, రహదారుల నిర్వహణ, సిబ్బంది పని తీరుపై ఫిర్యాదులను పరిష్కరించడం, ఉపాధిహామీ జాబ్ కార్డుల జారీ, పని కల్పన, పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాల ఏర్పాటు, పశు వైద్య సేవలు, నైపుణ్యాల పెంపునకు శిక్షణ, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన, కామన్ సర్వీస్ కేంద్రాల సేవలు తదితరాలను అందించాలి.

నిర్ణీత సమయంలో పరిష్కరించాలి..

ప్రతీ పంచాయతీ కార్యాలయంలో సమగ్రంగా, స్పష్టమైన సమాచారంతో కూడిన పౌర సేవల పట్టికలను ఏర్పాటు చేసి ప్రజా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంది. వీటికి తోడు ప్రజలు తమ ఫిర్యాదులను వెంటనే తెలియజేసేందుకు ఒక ఫిర్యాదు వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఆస్తిపన్ను,గణన,ఆస్తి యాజమాన్య హక్కు బదలాయింపు పత్రాలను 15 రోజుల్లో జారీ చేయాలి. నంబరు కేటాయింపు 30 రోజుల్లో, మురుగు కాలువలపై ఫిర్యాదులను మూడు రోజుల్లో, చెత్త కుండీల ఏర్పాటును రెండు రోజుల్లో చేయాలి. సంతల పరిశుభ్రతకు సంబంధించిన ఫిర్యాదులను మూడు రోజుల్లో, మంచినీటి కనెక్షన్ వారంలో అందించాల్సి ఉంది. పైప్ లైన్ లీకేజీ, చేతి పంపులకు మరమ్మతులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, వైకుంఠధామాల్లో అదనపు సౌకర్యాల ఏర్పాటు, రహదారుల నిర్వహణ, వివాహ నమోదు, లేఅవుట్, భవనాల నిర్మాణానికి అనుమతులు, జాబ్ కార్డుల జారీతో పాటు వివిధ అంశాలపై వచ్చే ఆర్జీలను ఎప్పటి లోగా పరిష్కరిస్తారో పౌర సేవల పట్టికలో ప్రదర్శించాలి. ఈ సేవలను పొందడానికి పంచాయతీకి ప్రభుత్వానికి సదరు వ్యక్తి ఎటువంటి బకాయిలు ఉండకూడదు.

పట్టికలను ఏర్పాటు చేయాలి



పౌర సేవల పట్టికల్లో పంచాయతీ కార్యాలయాలలో అందించే సేవలు, వాటి పరిష్కార సమయాలు స్పష్టంగా పొందుపరచి ప్రజలకు అవగాహన కల్పించాలి. గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు అమలు తదితర అంశాలను తెలియజేస్తూ సమర్థవంతంగా పౌర సేవల పట్టికలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. గ్రామీణులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– డిల్లీ శాంత, చొప్పల

అధికారులు నిర్లక్ష్యం వీడాలి



పంచాయతీ వ్యవస్థలో పౌర సేవల పట్టికలు ద్వారా పనుల నాణ్యతను మెరుగుపరచడం, ప్రజల హక్కులను రక్షించడం సాధ్యం. ఇలాంటివి చేయడంతో ప్రభుత్వ లక్ష్యాలను సాకారం చేసేందుకు అవకాశం ఉంది.ఇంతటి గొప్ప లక్ష్యం గల పౌర సేవల పట్టికల గురించి పంచాయతీ అధికారులు ఏమాత్రం అవగాహన కల్పించకపోగా వాటిని కార్యాలయాల ఎదుట ప్రదర్శించడం లేదు.

– దబ్బగట్ల ప్రసాద్, తాటిగూడెం

బోర్డులు ఏర్పాటు చేయిస్తాం..



పంచాయతీ కార్యాలయాల్లో అందించే సేవల గురించి ప్రజలకు తెలిసేలా పౌరసేవల బోర్డుల ఏర్పాటు తప్పనిసరి. అన్ని పంచాయతీ కార్యాలయాల్లో వెంటనే పౌర సేవల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలిస్తాం. వాటికనుగుణంగా ప్రజలకు సేవలందేలా చర్యలు తీసుకుంటాం.పంచాయతీ కార్యాలయాల్లో పారదర్శకతకు, ఆదర్శపాలనకు పౌర సేవల బోర్డులు ఉపయోగపడతాయి.

– దేవ వరకుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, కరకగూడెం

గీత కార్మికులకు ప్రభుత్వం అండ


రక్షక కవచం కిట్లు గౌడ కులస్తులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: గీత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మణుగూరులోని జెడ్పీకోఎడ్యుకేషన్ హై స్కూల్‌లో కాటమరాయుడు రక్షక కవచం కిట్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా గీత కార్మికులలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రక్షక కిట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఇందిర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికులు ప్రమాదవశాత్తూ కల్లుగీస్తున్న క్రమంలో జారిపడి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడం వల్ల వారిని నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడుతోందన్నారు. ప్రమాదాల బారిన పడకుండా కిట్లు ఉపయోగపడతాయన్నారు. నాలుగు సంవత్సరాలకు పైగా మన్నిక ఉండే కిట్లు వినియోగించి భద్రపరుచుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఒక్కో కిట్టు ధర రూ.12 వేలు ఉంటుందని, నియోజకవర్గ వ్యాప్తంగా 78 మందికి ఈ కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నక్కల శ్రీనివాస గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు పీరినాకి నవీన్, శివసైదులు, కూచిపూడి బాబు, గుడిపూడి కోటేశ్వరరావు, రహీం, తిరుమలేశ్, గాండ్ల సురేశ్, గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల సమస్యలపై సీపీఎం పోరాటం


దుమ్ముగూడెం: మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు


దమ్మపేట: ముష్టిబండ గ్రామంలో సీపీఎం జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

చంద్రుగొండ: పేద ప్రజల సమస్యలపై పోరాటాలు చేసేది సీపీఎంనేని ఆ పార్టీ మండల కార్యదర్శి ఐలూరి రామిరెడ్డి అన్నారు. మండలంలోని గుర్రాయిగూడెం గ్రామంలో పార్టీ గ్రామశాఖ మహాసభ ఆదివారం జరిగింది. తొలుత పార్టీ అమరులకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దారిద్రం దిగువకు పేదలు బ్రతుకులు రోజురోజుకు దిగాజారుతుంటే మరోవైపు బడాబాబులకు కేంద్రం కోట్లాది రూపాయలు దారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా గ్రామశాఖ కార్యదర్శిగా తూరుపాక శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఈ సభలో ఆ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ కాక సీత, విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, పి.శ్రీనివాసరెడ్డి, కాక హనుమంతరావు, కాక వీరస్వామి పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

దమ్మపేట: ఆరు గ్యారంటీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ప్రతి హామీని తూచ తప్పకుండా అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు దొడ్డా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ముష్టిబండ గ్రామంలో సీపీఎం జెండాను ఆవిష్కరించిన అనంతరం మండల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అమరజీవి సీతారాం ఏచూరి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలను ప్రోత్సాహిస్తుందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ హామీలను అమలు చేయని పక్షంలో, ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ముష్టిబండ గ్రామ శాఖ సీపీఎం పార్టీ కార్యదర్శిగా కోలికపోగు శ్రీనివాసరావును ఏకగ్రవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాంప్రసాద్, మోరంపూడి శ్రీనివాసరావు, జగపతి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలి

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామంలో నెలకొన్న లోవోల్టేజి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

ఆదివారం తూరుబాక గ్రామశాఖ 7వ మహాసభను నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తూరుబాక పరిధిలో ప్రతిరోజు 4సార్లు కరెంటు పోతుంది వెంటనే లోవోల్టేజ్ సమస్య పరిష్కారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో కట్టిన డబల్ బెడ్ రూమ్ స్థానిక అర్హులైన పేదలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. శాఖ పరిధిలో సీపీఎం పూర్వ వైభవం తీసుకుని రావాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో ఆందోళన పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, బొల్లి సత్యనారాయణ, బిల్లా ముత్యాలరావు, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, నాయకులు మర్మం చంద్రయ్య, బొల్లి సూర్యచంద్రరావు, కుమ్మరికుంట్ల సాంబశివరావు, బొల్లి నాగేశ్వరరావు, చెల్లికానీ వెంకన్న, సాయిబాబు, నాగిరెడ్డి పాల్గొన్నారు.


చంద్రుగొండ: అమరులకు జోహార్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలి


ఎంఈఓను సన్మానిస్తున్న ఆదివాసీ నాయకులు

కరకగూడెం: మండల ఎంఈఓగా ఇటీవల బాధ్యత చేపట్టిన కరకగూడెం జెడ్పీ పాఠశాల పీజీ హెచ్ఎం గడ్డం మంజులను ఆదివారం మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అభినందనాలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి సాంబమూర్తి మాట్లాడుతూ.. మండలంలో ఇదివరకు అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో విద్యా వ్యవస్థ గాడి తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని, విద్యా కార్యక్రమాలను సమీక్షించి అవసరమైన మార్పులు చేయాలని కోరారు. అలాగే ప్రతి పాఠశాల ప్రగతిని పర్యవేక్షించాలి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కోశాధికారి సొలం రామారావు, ఉద్యోగ సంఘ నాయకులు కుమారస్వామి, తిరుమలరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు చందా రామకృష్ణ, కార్యదర్శి కలం వేణుగోపాల్, విద్యార్థి నాయకులు కలం సంపత్, ఇర్ప నాగకృష్ణ, పోతెబోయిన సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన తనూజ

దుమ్ముగూడెం: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ వేముల వెంకటేశ్వరరావు కూతురు వేముల తనూజ ఈ ఏడాది విడుదల చేసిన నీట్ ఫలితాల్లో ప్రతిభ చాటి సంగారెడ్డి గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో తొలివిడత అడ్మిషన్‌లోనే ఎంబీబీఎస్ సీట్ సాధించింది. చిన్నప్పటినుంచే విద్య పట్ల ఆసక్తి ప్రదర్శించి అన్ని తరగతుల్లో కూడా ప్రథమ శ్రేణిలో నిలుస్తూ వచ్చింది. సీటు సాధించడంలో తల్లిదండ్రుల ప్రోత్సాహాన్ని ఈ సందర్భంగా ఆమె వెల్లడించింది. ఎంబీబీఎస్ సీట్ సాధించడంపై పలువురు తనూజను అభినందనలతో శుభాకాంక్షలు తెలియజేశారు.

అ'పూర్వ' సమ్మేళనం


భద్రాచలంటౌన్: పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు, అధ్యాపకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2001–02 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గత స్మృతులను నెమరేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ ఉద్వేగానికి లోనైనారు. చదువుకున్న పాఠశాల ఆవరణంలో తిరుగుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో చల్లా రమేష్, రుంజా రామకృష్ణ, సున్నం ప్రసాద్, చల్లా రాంబాబు, నీలిమ పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2008–10 సంవత్సరాలలో బీఎస్సీ, బీజెడ్‌సీ, ఎస్‌బీసీ గ్రూపుల్లో చదువుకు విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో సమావేశమై ఆత్మీయ సమ్మేళనమయ్యారు. కళాశాలలో చదువుకు 14 ఏళ్ల అనంతరం కలుసుకున్న వారు ఒకరికొక్కరు ఆలింగనం చేసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదులను కలయతిరుగుతూ అప్పటి మధుర స్మృతులను తలచుకున్నారు. ఈ సందర్భంగా అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కామేశ్వరరావు, బాలయోగి, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


అన్నపురెడ్డిపల్లి: పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

ములకలపల్లి: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఎస్ఆర్ఎల్ఐపీ) కాలువ మట్టి అక్రమ తరలింపు నివారించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు సీతారామ ప్రాజెక్ట్ గ్రావిటీ కెనాల్ (ప్యాకేజ్ –4) డీఈ రాంబాబు తెలిపారు. సీతారామ మట్టి అక్రమ రవాణా, కాలువకు పొంచిఉన్న ప్రమాదం నేపథ్యంలో 'మాయమవుతున్న సీతారామ మట్టి', 'యథేచ్ఛగా మట్టి తవ్వకం', 'యథేచ్ఛగా మట్టి తరలింపు'శీర్షికలతో 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. డీఈ కె.రాంబాబు ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి కాలువ ప్రదేశంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు. అక్రమ తరలింపు అంశంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అక్రమ తోలకాలు ఉక్కుపాదం మోపనున్నట్లు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేయనున్నట్లు డీఈ తెలిపారు.

లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు


అన్నపురెడ్డిపల్లి: ధనలక్ష్మి అవతారంలో అమ్మవారు


దుమ్ముగూడెం: అన్నపూర్ణ అలంకరణలో అమ్మవారు

అశ్వారావుపేట: లలితా త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు పలు ఆలయాల్లో అమ్మవారు ఆదివారం దర్శనమిచ్చారు. ఆదివారం అశ్వారావుపేటలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం, కోదండరామాలయం, షిరిడీ సాయిబాబా ఆలయం, గుర్రాలచెరువు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, డ్రైవర్స్ కాలనీ కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లలితా త్రిపుర సుందరీ అవతారంలో అమ్మవారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దమ్మపేట: దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండపాల్లో ఆదివారం అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో శివశక్తి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రుల ఉత్సవాల్లో అమ్మవారిని లలిత దేవి రూపంలో రంగుల చీరలు, అభరణాలు, పూలతో ఘనంగా అలంకరించారు. పుణ్య దంపతుల సమక్షంలో వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అన్నపూర్ణ అలంకరణలో..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 4వ రోజు కనకదుర్గ అమ్మవారిని అన్నపూర్ణ అలంకరణలో అలంకరించారు. ముందుగా ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాల్‌చార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.అనంతరం అమ్మవారిని అన్నపూర్ణ అలంకరణ చేసి కుంకుమాభిషేకం నిర్వహించారు. అన్నపూర్ణ అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ధనలక్ష్మి అవతారంలో..

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ఆదివారం అమ్మవారు ధనలక్ష్మి అవతారంలో భక్తులు దర్శనమిచ్చారు. శివాలయంలో కొలువుదీరిన అమ్మవారిని శ్రీలలితా పరమేశ్వరిగా అలంకరించారు. మండలంలో కొలువుదీరిన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


అశ్వారావుపేటలో లలితా త్రిపుర సుందరీ అవతారంలో అమ్మవారు